ఇక్ఫై యూనివర్సిటీ ఏవోపై ఆరోపణలు అవాస్తవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఐసీఎఫ్ఏఐ (ఇక్ఫై) యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేటర్‌గా పని చేస్తున్న ముక్తినేని లక్ష్మీప్రసన్నపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని ఎల్బీనగర్‌కు చెందిన సుమన్, స్వాతి తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇక్ఫై యూనివర్సిటీలో అభివృద్ధి పనుల కోసం పెట్టుబడులను ఆహ్వానించి తెనాలికి చెందిన సబ్బ సతీష్ మోసం చేశారని తెలిపారు. 2023లో తాము 43లక్షల రూపాయలు సతీష్‌కు చెల్లించామని వచ్చిన లాభాల నుంచి 20 శాతం ఇస్తామని చెప్పి మోసం చేశాడని పేర్కొన్నారు. ఈ విషయంపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సతీష్‌ను అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రస్తుతం అతడు బెయిల్‌పై బయటికి వచ్చాడన్నారు. అయితే గతంలో యూనివర్సిటీలో ఏవోగా పనిచేసిన ముక్తినేని లక్ష్మీప్రసన్న హస్తం ఉందని ఆయన చేసిన ఆరోపణలలో వాస్తవం లేదన్నారు.

స్వయం ఉపాధి పొందుతూ నలుగురికి ఉపాధి కల్పించాలి



చిక్కడపల్లి: స్వయం శక్తితో ఉపాధి పొందుతూ నలుగురికి ఉపాధి కల్పించాలని కార్పొరేటర్ పావని అన్నారు. గురువారం డివిజన్‌లోని వై జంక్షన్ వద్ద శ్రీనివాస్ ఏర్పాటు చేసుకున్న ధరణి టెంట్ హౌస్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్ కుమార్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, చిర్రా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


సన్మానం



నూతన సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న అర్చకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక, ఉద్యోగుల మలిదశ గ్రాంట్-ఇన్-ఎయిడ్ సాధన సమితి నూతన సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకయ్యింది. బుధవారం భోలక్‌పూర్‌లోని భవానీశంకర దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక, ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అర్చక సంఘం అధ్యక్షుడిగా సంగవరపు ప్రసాద్‌శర్మ, ఉపాధ్యక్షులుగా మాడభూషిణి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నెమలికొండ జయవర్ధనాచార్య శర్మ, కార్యదర్శిగా అన్నెపర్తి శివప్రసాద్ శర్మను ఎన్నుకున్నారు. అలాగే ఉద్యోగ సంఘం నూతన అధ్యక్షుడిగా దురిశెట్టి విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా ఆసోరి మరికంటి ముకుందు, పెనుమాక గోపి, ప్రధాన కార్యదర్శులుగా పొన్నగంటి వెంకన్న, గోర్లపల్లి గణేష్, కార్యదర్శులుగా నాగార్జున, ఉద్యమకారి విశాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అర్చకులు నూతన సంఘం ప్రతినిధులను సన్మానించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



చిక్కడపల్లి: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన శ్రావణమాస బోనాల వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌రావు, జైరుబాయి తదితరులు పాల్గొన్నారు.

‘ముస్లింలే లక్ష్యంగా బీజేపీ దాడులు’

హిమాయత్‌నగర్: ముస్లింలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ హిందూ, ముస్లింల విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని ఆలిండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ(ఏఏసీపీ) వ్యవస్థాపక అధ్యక్షురాలు షహనాజ్ తబస్సుమ్ ఆరోపించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి అధికారం చేజిక్కిన తర్వాత ముస్లింలకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చారని ఆరోపించారు. ముఖ్యంగా ముస్లింలను అణిచివేతగానే బీజేపీ పని చేస్తోందని చెప్పారు. ఏఐఏసీపీ 2014లో రిజిస్టర్ అయ్యిందని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఆలిండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఏఐఏసీపీ జాతీయ సెక్రటరీ అదిల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి వై.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆకేపోగు ప్రమోద్ మహారాజ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు వాషిక్ నుమాన్ అజాద్ పాల్గొన్నారు.

కృషి ఉంటే ఏదైనా సాధించొచ్చు

● తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎంఏ ఫహీమ్ ● వైఎంసీఏలో కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ షురూ



క్రీడా పోటీల్లో మార్చ్ ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు



స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఫహీమ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న నిర్వాహకులు



పోటీల్లో పాల్గొని బాస్కెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

కాచిగూడ: క్రీడల పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ తెలుస్తుందని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ అన్నారు. గురువారం నారాయణగూడ వైఎంసీఏ క్రీడా మైదానంలో 25వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాల బాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, క్రికెట్, మార్చ్ ఫాస్ట్ పోటీలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఎంఏ ఫహీమ్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై ఎంత శ్రద్ధ వహిస్తారో అదే స్థాయిలో క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో ప్రయత్నం చేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. అదే విధంగా ఈ క్రీడా సర్టిఫికెట్లు మీ జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లిన సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి. జోనథన్ ధర్మరాజు, జీఎం దీన్‌దయాల్, బీజే వినయ్‌స్వరూప్, ప్రధానకార్యదర్శి ఎం.ప్రిస్టిలీ గైస్, వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ అన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో అనేక మంది యువత తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చిక్కడపల్లిలోని ఆరోరా కళాశాలలో హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తదితర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ.... డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపితే తమ అమూల్యమైన ప్రాణంతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా హాని కలుగుతుందన్నారు. సిగ్నల్ జంప్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయొద్దని కోరారు. కొంత మంది యువకులు బైకుల మీద స్టంట్స్ చేస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ విరేశం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌కుమార్, బేగంపేట సిబ్బంది ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లి ఆరోరా కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలన కోసం నిర్వహించిన ర్యాలీలో డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణతో కలిసి ఆమె పాల్గొన్నారు. డివిజన్‌లోని కళాధర్‌నగర్, గంగపుత్ర కాలనీ, బాపూజీనగర్‌లలో ర్యాలీ కొనసాగింది. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా ఇళ్ల పైకప్పుపై వ్యర్థాలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెంది దోమలు పెరుగుతాయని తెలిపారు. రోడ్లపై చెత్త వేయకుండా తమను తాము నియంత్రించుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి జీహెచ్ఎంసీ కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచిముదిరాజ్, నాయకులు మెట్టు వాసు, వెంకటేష్, బాలు, ప్రసాద్‌గుప్తా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీలో కార్పొరేటర్, అధికారులు

బీసీ రిజర్వేషన్లలో మైనార్టీ కోటాను తొలగించండి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లలో మైనార్టీ కోటాను పూర్తిగా తొలగించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 42శాతం రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే అమలయ్యే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు. 42శాతం బీసీ రిజర్వేషన్లలో 11 శాతం మైనార్టీలకు కేటాయిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంతో బీసీలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. బీసీల్లో మైనార్టీ రిజర్వేషన్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. మైనార్టీలకు 11 శాతం కేటాయిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీలకు అన్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే బీసీలు తిరగబడతారని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలి

హిమాయత్‌నగర్: జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా.కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం వేదిక ఆధ్వర్యంలో ‘మేమెంతో మాకంత’ వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకు ఆగస్టు 3న చలో హైదరాబాద్ పేరిట నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే వైశ్య రాజకీయ రణభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు నమశ్శివాయ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ తదితర నాయకులతో కలిసి మాట్లాడారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో ఎంపీటీసీ 30, జెడ్పీటీసీ 30, జెడ్పీ చైర్మన్ ఒకటి, మేయర్ ఒకటి, మున్సిపల్ చైర్మన్ 15స్థానాలకు అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణతో పాటు వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్కిల్ యూనివర్సిటీలో 25శాతం సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోప), ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి(ఏసీపీఎస్) సంపూర్ణ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. వేదిక ప్రతినిధులు ఈశ్వరయ్య, ఉపేందర్, నాగేందర్, నాగరాజు, స్రవంతి, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

‘సనాతన అవతార్’ పుస్తక ఆవిష్కరణ

హిమాయత్‌నగర్: సనాతన్ అవతార్ ఆవిష్కరణ కేవలం ఒక పుస్తకం ఆవిష్కరణ కాదని, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఆధ్యాత్మిక వారసత్వం వేడుక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక విలువలతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ జీ జీవితానికి ‘సనాతన అవతార్’ పుస్తకం అద్దం పడుతుందన్నారు. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలంగాణ, దినేష్ షహ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సర్దార్ పటేల్ ఆడిటోరియంలో ముంబైకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ దినేష్ షహ్రా రచించిన ‘సనాతన అవతార్’ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఫ్రీడమ్ ఆయిల్ డైరెక్టర్ ప్రదీప్ చౌదరి, పారిశ్రామికవేత్త సునీల్ గోయాంక హాజరై ఆవిష్కరించారు. ముందుగా రవిశంకర్ జీ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అతిథులను ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు రవికుమార్ రావు, సంతోష్ రావు, భామిని రావు ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన ‘శ్రావణ సత్సంగ్’ కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఒత్తిడి లేని, హింస లేని జీవనానికి ప్రపంచ ఉద్యమంగా కొనసాగుతోందన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే రూ.1000 జరిమానా



కుద్బిగూడలో రోడ్లపై చెత్త వేస్తున్న ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంసీ, కార్పొరేటర్

కాచిగూడ: ప్రజలు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయవద్దని, ఇంటింటికి చెత్త సేకరణ కోసం వచ్చే సిబ్బందికి చెత్తను అందజేయాలని అందజేయాలని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్ సూచించారు. చెత్తను రోడ్లపై వేస్తే రూ.1000 జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. గురువారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి డీఎంసీ మారుతి దివాకర్ డివిజన్ పరిధిలో పర్యటించి వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశుద్ధ్యం, దోమల నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లపై పేరుకుపోయిన మట్టికుప్పలను, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను, సిబ్బందిని ఆయన ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రజలు సహకరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, యుఎంఎస్ అధికారి దుర్గాప్రసాద్, ఎస్ఎస్ తిరుపతి, ఎస్ఎఫ్ఏలు వెంకటయ్య, రజిత, బీజేపీ నేతలు బల్వీర్, సుభాష్ పటేల్, శీర్‌సాగర్, బి.భీమ్‌రాజ్, వాసు, బాలప్రసాద్, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, సూరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం చెప్పల్‌బజార్‌లోని బీజేపీ ఓబీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 2వ తేదీన ఇందిరాపార్కు వద్ద చేపట్టిన బీజేపీ ధర్నా కార్యక్రమంలో బీసీ కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి, మహిళా సంఘాలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించిందన్నారు. గొల్ల కురుమలు, కులవృత్తులకు చెందిన ప్రతి కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి సంవత్సరానికి రూ.20వేల కోట్లు బీసీలకు కేటాయిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నేతలు మల్లేష్, నర్సింగ్‌రావు, అచ్చిని రమేష్, వెంకటస్వామి, అనిల్, వెంకటేష్, వంజరి రవీందర్, యాదయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సామాజికంగా.. ఆర్థికంగా ఎదగాలి



ఈటె ప్రభాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న కందగట్ల స్వామి

కాచిగూడ: పద్మశాలీలు రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈటె ప్రభాకర్‌ను అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి (హెడ్ క్వార్టర్స్) గా నియమిస్తూ నియామకపు పత్రాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పద్మశాలీలు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతో పాటు అట్టడుగున ఉన్న వారిని ఆదుకోవాలని అన్నారు. ఈటె ప్రభాకర్ పద్మశాలి మాట్లాడుతూ.. పద్మశాలీల అభివృద్ధి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు జాతీయ కార్యదర్శిగా అవకాశం కల్పించిన అధ్యక్షుడు కందగట్ల స్వామికి, సహకరించిన కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో పద్మశాలీలను చైతన్యవంతులను చేయడానికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

‘ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది’



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: దేవాలయాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఆలయాలను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ సూచించారు. దోమలగూడ శ్రీహనుమాన్ దేవాలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం గురువారం జరిగింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈఓ దేవనాథం ఈ సందర్భంగా కమిటీ చైర్మన్‌గా కేఆర్‌కే ప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా ఆర్.రాము, వై కృష్ణ, జె పరమేశ్వర్, ఆర్ వెంకట్‌రెడ్డి, సలంద్రి శివకుమార్ యాదవ్, కె.మంజులరాణి, జె. మహేందర్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం అంజన్ కుమార్ యాదవ్ వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీడీ కృష్ణ, అంజియాదవ్, భాస్కర్, అభిషేక్ కెనడీ, శ్రీనివాస్‌యాదవ్, తిరుమలరావు, అర్చకుడు అల్లం ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఘటనోద్యమ దళపతి లింగన్నకు విప్లవ జోహార్లు



లింగన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు, ప్రతిఘటనోద్యమ దళపతి పూన్నెం లింగన్న 6వ వర్ధంతి సభను గురువారం విద్యానగర్ మార్క్స్‌భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆదివాసీ ముద్దుబిడ్డ, మన్యం వీరుడు లింగన్న అమరుడై నేటికి ఆరేళ్లయ్యిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు పాలకులు లింగన్నను టార్గెట్ చేసి గుండాల మండలం రోళ్లగడ్డ అడవులల్లో పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారన్నారు. లింగన్న ఏ ఆశయ సాధన కోసమైతే పోరాడారో దాని కోసం మనం అందరం పని చేయాలన్నారు. అదే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ గ్రేటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ, అనురాధ, పీడీఎస్‌యూ నాయకులు పి.మహేష్, పొడపంగి నాగరాజు, మందా నవీన్, కె.శ్రీనివాస్, గౌతమ్, ఆసిఫ్, శ్యామ్, యశ్వంత్, పీఓడబ్ల్యూ నాయకులు భారతి, మల్లిక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

చిక్కడపల్లి: కార్మికులకు కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎల్ పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీక్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రూ.9వేలు కనీస పింఛన్‌ను ఇవ్వాలని కోరారు. మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని అన్నారు. అనంతరం కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ హైదరాబాద్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కార్యదర్శి వి.ప్రవీణ్, నేతలు కేఎస్ ప్రదీప్, లింగంగౌడ్, అఫ్జల్, ప్రభాకర్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న టీయూసీఐ నాయకులు

దెబ్బతిన్న రహదారులు..

రాకపోకలకు ఇబ్బందులు



బండమైసమ్మ నగర్ చౌరస్తా రహదారి దుస్థితి



గుంతలమయంగా దోమలగూడ ప్రధాన రోడ్డు

కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఇటీవలే కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. కంకరతేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు తప్పడం లేదు. బండ మైసమ్మ నగర్ చౌరస్తా నుంచి ఎల్ఐసీ కాలనీ చౌరస్తా వరకు రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి దోమలగూడ చౌరస్తా వరకు వెళ్లే రహదారి పరిస్థితి అలాగే ఉంది. ముగ్గుబస్తీ, చిత్రాలనగర్‌తో పాటు పలు బస్తీలు, కాలనీల్లో నిత్యం డ్రైనేజీ పారడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

– కవాడిగూడ